జాతీయ వార్తను
ఈ-పేపర్‌లోనూ,
డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.జాతీయవార్త.
కామ్‌లో కూడా వీక్షించవచ్చు.

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com


# జాతీయ వార్త

తెలుగు దిన పత్రిక


చదవండి.. చదివించండి..

జాతీయ వార్త తెలుగు దినపత్రిక

మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రిక ద్వారా ప్రచురించి మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761

epaper:jatheeyavaartha.com www.jatheeyavaartha.com

గురువారం | 4-9-2025 | శ్రీకాకుళం | సంపుటి: 2 సంచిక: 444 పేజీలు: 4 వెల : రూ.7


మహా ముదుర్లు!

* పని చేయడు.. పెత్తనం చెలాయిస్తుంటాడు
* నర్సింగ్ సూపరింటెండెంట్ పేరు చెప్పుకొని కలెక్షన్లు
* రిమ్స్ ఉన్నతాధికారుల మాదిరిగా వార్డుల్లో తనిఖీలు
* రోస్టర్ డ్యూటీ తప్పించినా.. మళ్లీ అదే పని
* గతంలోనూ మనోడిపై ఫిర్యాదులు
* అశోక్ అండదండలతో చంద్రమౌళిది ఇదే తంతు
* అటెండెన్స్ వేసుకుని ఆపై రిమ్స్ నుంచి మాయం
* అడిగేవారు లేకపోవడంతో ఇష్టారాజ్యంగా విధుల నిర్వహణ

శ్రీకాకుళం క్రైం, సెప్టెంబరు 2 (వార్త): రిమ్స్‌లోని మేల్ నర్సుగా పనిచేస్తున్న అశోక్ మహా ముదురు. విధులకు వస్తాడో, ఎప్పుడు వెళతాడో తెలియదు. తనకు నచ్చినట్టుగా పనిచేస్తాడు. నర్సింగ్ సూపరింటెండెంట్‌కు రైట్, లెఫ్ట్‌గా వ్యవహరిస్తుంటాడు. నర్సింగ్ సిబ్బంది ఎవరెవరు, ఎక్కడెక్కడ విధులు వేయాలన్నది మనోడే చూసుకుంటాడు. తన మాట విన్న వారికి ఓ చోట, విననివారికి మరో చోట విధులకు పంపిస్తుంటాడు. ఎవరైనా ఇదేంటని ప్రశ్నిస్తే నచ్చితే పనిచేయండి.. లేకుంటే సెలవుపై వెళ్లిపోండని హుకుం వేస్తుంటాడని నర్సులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నర్సింగ్ సూపరింటెండెంట్ దృష్టికి కొందరు తీసుకువెళ్లినా ఆమె చూసీచూడనట్టు వ్యవహరిస్తుండడంతో మనోడి అరాచకాలకు అడ్డూ అదుపూ లేకుండా పోయిందని పలువురు నర్సులు బహిరంగంగానే ఆరోపణలు చేస్తున్నారు. రిమ్స్ సూపరింటెండెంట్‌గా ఇటీవల విధుల్లో జాయిన్ అయిన డాక్టర్ అమూల్య మనోడిని ఈ రోస్టర్ డ్యూటీ నుంచి పక్కకు తప్పించి ట్రామా వార్డుకు పంపించినట్టు తెలిసింది. అయినప్పటికీ నర్సింగ్ సూపరింటెండెంట్‌తో ఉన్న చనువుతో మనోడు ఇక్కడే విధులు నిర్వహిస్తున్నాడు. నర్సులు ఎక్కడ పనిచేయాలన్న రోస్టర్ వేసిన తర్వాత మనోడు మచ్చుకైనా రిమ్స్‌లో కనిపించడని, ట్రామా కేర్‌లో కాకుండా అడ్మినిస్ట్రేషన్ విభాగం వద్దే ఉంటాడని కొందరు చెబుతున్నారు. ట్రామా వార్డులో ఉండకుండా అన్ని వార్డుల్లో తిరుగుతూ నర్సులు పనిచేస్తున్నారా లేదా అనేది తనిఖీలు చేస్తూ వారికి ఉచిత సలహాలు ఇస్తుంటాడట. ఎవరైనా తన మాట వినకపోతే వారిపై నర్సింగ్ సూపరింటెండెంట్‌కు చాడీలు చెబుతుంటాడు. నర్సులకు సెలవులు కావాలన్నా డ్యూటీలు మార్చాలన్నా మనోడికి ఎంతోకొంత చెల్లించాల్సి ఉంటుందని పలువురు నర్సింగ్ సిబ్బంది చెబుతున్నారు. అశోక్‌కు వెన్నుదన్నుగా మరో మేల్ స్టాఫ్‌నర్సు చంద్రమౌళి ఉంటాడు. చంద్రమౌళికి అశోక్ మాటే వాదవాక్కు. రెండేళ్లుగా బ్రాంకోస్కోపీ వార్డులోనే విధులు నిర్వహిస్తుంటాడు. ఈ చెస్టు వార్డుకు పెద్దగా ఓపీ లేకపోవడంతో మనోడు కూడా సక్రమంగా రిమ్స్‌కు రాడు. పేషియల్ అటెండెన్స్ వేసుకున్న తర్వాత వీరిద్దరూ రిమ్స్ అంతా కలియదిరుగుతూ ఉంటారు. చంద్రమౌళిపై సైతం అనేక ఫిర్యాదులు ఉన్నాయి. వార్డులో ఉండడని, అశోక్ అండదండలతో తోటి సిబ్బందికి ఇబ్బందులు పెడుతుంటాడని, తోటి సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అశోక్‌పై గతంలో పేట్రేగిపోతుంటాడని, నర్సింగ్ సూపరింటెండెంట్ పేరు చెప్పుకొని కూడా అనేక ఫిర్యాదులు ఉన్నాయి.

(మేల్ నర్సు అశోక్, చంద్రమౌళి ఆగడాలపై మరిన్ని వివరాలతో మరో కథనంలో కలుద్దాం)

హవా సాగిస్తున్న వారిపై రిమ్స్ సూపరింటెండెంట్ విచారణ జరిపి తగు చర్యలు చేపట్టాలని నర్సింగ్ సిబ్బంది కోరుతున్నారు.

# రిమ్స్‌లో చక్కర్లు కొట్టిన.. జాతీయ వార్త కథనం

* హర్షం వ్యక్తం చేసిన కొందరు నర్సింగ్ సిబ్బంది * బెంబేలెత్తిన మరికొందరు నర్సులు, ఆ శాఖ అధికారులు * ఏ ఇద్దరు కలిసినా ఇదే చర్చ * ఆధారాలిస్తే చర్యలు తీసుకుంటామన్న నర్సింగ్ సూపరింటెండెంట్ * చంద్రమౌళిపై వెల్లువెత్తుతున్న ఆరోపణలు * రెండేళ్లుగా నైట్‌డ్యూటీ చేయని మేల్‌నర్స్ చంద్రమౌళి * కొందరు వైద్యులు, నర్సింగ్ అధికారుల అండదండలు

శ్రీకాకుళం క్రైం, సెప్టెంబరు 3 (వార్త): రిమ్స్‌లో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల పనితీరు, వారిపై వచ్చిన ఆరోపణలు, వారి వెనుకుండి నడిపిస్తున్న వారిపై 'జాతీయ వార్త'లో వచ్చిన కథనం శ్రీకాకుళం సర్వజనాసుపత్రి (రిమ్స్)లో చక్కర్లు కొట్టింది. ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది సామాజిక మాధ్యమాల్లో హల్‌చల్ అయింది. ఈ కథనంపై కొందరు నర్సింగ్ సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు. వీరి వల్ల ఇబ్బందులు పడిన వారు ఫోన్లు చేసి మరీ తమకు జరిగిన నష్టాన్ని, కష్టాన్ని తెలియజేశారు. రెండేళ్లకుపైగా బ్రాంకోస్కోపీ వార్డులోనే విధులు నిర్వహిస్తున్న మేల్ నర్సు చంద్రమౌళి పగటిపూట మాత్రమే విధులు నిర్వహిస్తుంటాడని, రాత్రి డ్యూటీ అస్సలు చేయడని తోటి నర్సింగ్ సిబ్బందే చెబుతున్నారు. గతంలో చెస్టు వార్డు విభాగాధిపతిని, నర్సింగ్ సూపరింటెండెంట్‌ను మచ్చిక చేసుకుని ఆర్డర్ కూడా పాస్ చేసుకున్నాడట. రెండేళ్లుగా నైట్ డ్యూటీ అనేది చంద్రమౌళికి తెలియదంటే.. ఏవిధంగా మేనేజ్ చేసుకున్నాడో అర్థం చేసుకోవచ్చు. నర్సింగ్ సిబ్బంది మూడు షిఫ్టుల్లో డ్యూటీ చేస్తుంటే.. మనోడు కేవలం పగలు డ్యూటీ చేయడంలో ఆంతర్యం ఏమిటో మరి. ఒక్కో నర్సుకు నెలకోసారి షిఫ్టు డ్యూటీ మారుస్తుంటారు. ఒక నెల ఉదయం, మరో నెల రాత్రి, మరో రెండు నెలలు మధ్యాహ్న సమయంలో డ్యూటీ చార్ట్ ఉంటుంది. అయితే చంద్రమౌళి మాత్రం పగలు డ్యూటీకే పరిమితం అవుతున్నాడు. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి అయినప్పటికీ రెగ్యులర్ ఉద్యోగులనే డామినేట్ చేసే స్థాయికి ఎదిగాడని తోటి సిబ్బందే విమర్శలు చేస్తున్నారు. ఈవిషయం ప్రస్తుత నర్సింగ్ సూపరింటెండెంట్ గ్రేడ్1కు తెలిసి జరుగుతుందో, తెలియదో మరి ఆ పెరుమాళ్‌కు ఎరుక. అయితే ఆమె మాత్రం తాను ఇటీవల బాధ్యతలు తీసుకున్నానని, మేల్ నర్సింగ్ సిబ్బంది చేస్తున్న ఆగడాలపై తనకు సాక్ష్యాధారాలు ఇస్తే విచారణ చేయిస్తానని చెబుతున్నారు. నర్సింగ్ సూపరింటెండెంట్ చనువు ఇవ్వడం వల్లే కొందరు మేల్ నర్సులు పేట్రేగిపోతున్నారన్న విమర్శలను బాధిత మహిళా నర్సులు బాహాటంగానే గుప్పిస్తున్నారు. ఈ చెస్టు వార్డుకు పెద్దగా ఓపీ లేకపోవడంతో మనోడు కూడా డిపార్టుమెంట్ హెడ్ ఉంటేనే డ్యూటీకి వస్తాడు.. లేకుంటే బలాదూర్‌గా తిరుగుతుంటాడని ఆ వార్డులో పనిచేస్తున్న కొందరు పేర్కొంటున్నారు. వార్డులో ఉండడని నర్సింగ్ సిబ్బంది వాపోతున్నారు.

రిమ్స్ సూపరింటెండెంట్ ఇటీవలే బాధ్యతలు తీసుకున్నారు. ఆమె దృష్టికి చాలా వరకూ సమస్యలను ఆయా శాఖల విభాగాధిపతులు తీసుకువెళ్లడం లేదు. దీనివల్ల కొందరు నర్సులు ఆడింది.. ఆట పాడింది పాటగా మారింది. ఎప్పుడు వస్తారో, ఎప్పుడు వెళతారో తెలియదు. కొందరు నర్సులు సైతం తమ సమస్యలను సూపరింటెండెంట్ దృష్టికి తీసుకువెళ్లలేకపోతున్నారు. ఒకవేళ తీసుకువెళ్లేందుకు యత్నిస్తే ఆ శాఖ హెడ్‌ల నుంచి ఎటువంటి ఇబ్బందులు తలెత్తుతాయోనని మౌనం వహిస్తున్నారు.



# ఉమారుద్ర కోటేశ్వర ఆలయం పాలకమండలి సభ్యులుగా చిన రాజు



* ఎమ్మెల్యే గొండు శంకర్ సమక్షంలో ప్రమాణ స్వీకారం
* దేవాలయాలను పరిరక్షించాలి * ఆలయాలు హిందూ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతిబింబాలు * శ్రీకాకుళం ఎమ్మెల్యే శంకర్

శ్రీకాకుళం, సెప్టెంబర్3(వార్త): హిందూ దేవాలయాలు సనాతన సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతిబింబాలని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. నగరంలోని ఉమా రుద్ర కోటేశ్వర స్వామి, దుర్గామాతా ఆలయాలకు నూతనంగా ఏర్పాటైన పాలకమండలి సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆలయాలను పరిరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. దేవాలయాల పురాతన నిర్మాణాలను, సంస్కృతి ప్రాధాన్యతను కాపాడుకోవాలని భవిష్యత్ తరాలకు వీటికి అందించాలని సూచించారు. దేవాలయాల పరిరక్షణతో పాటు వాటి భూములను కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని తెలిపారు. శతాబ్దాల చరిత్ర, ఆధ్యాత్మికతకు సాక్ష్యంగా నిలిచే పురాతన దేవాలయాలను సంరక్షించుకునే బాధ్యతను పాలకమండలి సభ్యులు తీసుకోవాలన్నారు. ఉమారుద్ర కోటేశ్వర స్వామి ఆలయ చైర్మన్‌గా పాండురంగ దేవేంద్ర నాయుడుతో పాటు పాలకవర్గ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో మునగవలస సుకన్య, ప్రధానార్చకులు ఆరవెల్లి శ్రీరామమూర్తి శర్మ, దుర్గామాత ఆలయ అర్చకులతో పాటు టీడీపీ నేతలు పాండ్రంకి శంకర్, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

## చినరాజుకు అభినందనలు..

ఉమారుద్ర కోటేశ్వర స్వామి ఆలయ పాలకమండలి సభ్యునిగా ప్రమాణస్వీకారం చేసిన చినరాజును పలువురు అభినందనలు తెలిపారు. పుష్పగుచ్ఛాలను అందజేశారు. శ్రీకాకుళం నగరంలోని సరస్వతి సినిమా థియేటర్ మేనేజర్‌గా చినరాజు ఉన్నారు. ఆయన పలు సామాజిక కార్యక్రమాల్లో విస్తృతంగా సేవలు అందిస్తున్నారు. చినరాజు నియామకం పట్ల జిల్లాలోని సినిమా థియేటర్ల యాజమాన్యం, సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు.

# చేతబడి చేశాడని హత్య

* కేశుపురంలో వృద్ధుడిపై కర్రలు, రాళ్లతో దాడి * అక్కడికక్కడే మృతి చెందిన రాములు * దాసుడు చెప్పాడని అఘాయిత్యానికి పాల్పడిన కొందరు గ్రామస్థులు * ఘటనా స్థలాన్ని పరిశీలించిన డీఎస్పీ * పోలీసుల అదుపులో కొందరు గ్రామస్థులు



పలాస, సెప్టెంబరు3 (వార్త): చేతబడి చేస్తున్నాడన్న అనుమానంతో 80 ఏళ్ల వృద్ధుడు ఉంగ రాములుని కర్రలు, రాళ్లతో దాడి చేసి హత్య చేసిన ఘటన పలాస మండలంలోని కేశుపురంలో మంగళవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. పోలీసులు, కుటుంబీకులు అందించిన వివరాలిలా ఉన్నాయి. కేశుపురం గ్రామానికి చెందిన అంబలి తులసీరావు కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. కుటుంబీకులు సంతబొమ్మాళి మండలం బోరుభద్ర గ్రామానికి ఓ దాసుడి వద్దకు వెళ్లారు. ఆ దాసుడు మంగళవారం రాత్రి తులసీరావు ఇంటికి వచ్చి పూజలు చేశాడు. గ్రామానికి చెందిన వ్యక్తి చేతబడి చేశాడని చెప్పాడు. దీంతో తులసీరావు కుటుంబీకులంతా రాములుపై అనుమానం పెంచుకున్నారు. దాసుడు వెళ్లిన తర్వాత రాత్రి 11 గంటల తర్వాత తులసీరావు, అంబలి చంద్రయ్య, సారిపతి రాజ్‌కుమార్, బుడ్డ తేజేశ్వరరావు, బుడ్డ లక్ష్మీకాంత్, అంబలి రాశి, కోనారి సూర్యనారాయణ, అంబలి భీమారావులు రాములు ఇంటికి చేరుకుని కర్రలు, రాళ్లతో దాడి చేశారు. దీంతో రాములు అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న కాశీబుగ్గ డీఎస్పీ వి.వెంకటఅప్పారావు, సీఐ పి.సూర్యనారాయణ బుధవారం వేకువజామున కేశుపురం వచ్చి మృతుడి భార్య, కుటుంబీకులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. హత్యకు వినియోగించిన కర్రలు, రాళ్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా డీఎస్పీ వెంకటఅప్పారావు మీడియాతో మాట్లాడుతూ చేతబడి అనుమానంతో ఈ హత్య చేశారని తెలిపారు. కేసు నమోదు చేశామని, సమగ్ర దర్యాప్తు చేస్తున్నామన్నారు. అయితే కొంతమందిని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్టు సమాచారం.



జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక

శ్రీకాకుళం



## ఉపాధ్యాయురాలికి గ్రామస్తుల వీడ్కోలు

**శ్రీకాకుళం, సెప్టెంబరు 3(వార్త):** తిలారు కాలనీలో గల ప్రాథమిక పాఠశాలలో 8 సంవత్సరాలు పనిచేసి బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయురాలు చల్ల హేమలతకు సహ ఉపాధ్యాయులు, గ్రామస్తులు, పెద్దలు తర్ర రామకృష్ణ, స్కూల్ క్లస్టర్ చైర్మన్ యమ్.ఎస్.చంద్రశేఖర్ బుధవారం సన్మానించారు. ఆమె సేవలు కొనియాడారు. పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామస్తులు ఆధ్వర్యంలో విద్యార్థులు ఆమెకు ఘనంగా వీడ్కోలు పలికారు.



# ఎరువులెప్పుడిస్తారు?

**- సంతబొమ్మాళి జనరల్ బాడీ సమావేశంలో ప్రశ్నించిన సభ్యులు**

**-మూడు నెలలకు ఒకసారి జరిగే సమావేశానికి అధికారులు రాకపోవడంపై మండిపాటు**

**- అధికారుల గైర్హాజరుపై కలెక్టర్‌కు నివేదన**

**సంతబొమ్మాళి, సెప్టెంబరు 3(వార్త):** ప్రస్తుత ఖరీఫ్ సీజన్లో ఎరువులు కొరతతో రైతులు సతమతమవుతున్నారని మండల సభ్యులు అధికారులను ప్రశ్నించారు. వరి నాట్లు జరిగి ఆఖరి సీజన్ పోస్తున్న 25 కేజీలు యూరియా ఎంతవరకు సరిపోద్దని సభ్యులు బుడ్డా మోహన్ రెడ్డి, మార్పు నాగభూషణ రావు, చింతాడ చిన్నారావు, ఎన్ని మన్మధరావు, సురాడ రాజారావు, మార్పు అశోక్ చక్రవర్తి, బచ్చల సుధాకర్ అధికారులను నిలదీశారు. ఎరువుల కొరత లేదని ఓ పక్క జిల్లా కలెక్టర్, వ్యవసాయ మంత్రి ప్రకటనలు ఇస్తున్నారని, అందుకు విరుద్ధంగా సంతబొమ్మాళి మండలంలో జరుగుతుందని వారు అన్నారు. ప్రైవేట్ డీలర్లు మండలంలో ఇష్టారాజ్యంగా వ్యవహరించి, బ్లాక్ చేసి అధిక ధరలకు అమ్ముతున్నారని



వారు ఆరోపించారు. టిడిపి నాయకులు వద్దకు ఎరువులు పంపిస్తే, సామాన్య రైతులకు ఎలా అందుతాయని ఎంపీడీవోను ప్రశ్నించారు. సచివాలయాల ద్వారా పంపిణీ జరిగితే సకాలంలో అందరికీ అందుతాయని వారు అన్నారు. ఇటువంటి సీజన్లో ఏవో గైర్హాజరావడం ఎంతవరకు సమంజసం అని వారు ప్రశ్నించారు. మూడు నెలలకు ఒకసారి జరుగుతున్న సర్వసభ్య సమావేశానికి కొంతమంది అధికారులు



పూర్తిగా రాకపోవడంపై సభ్యులు ప్రశ్నించారు. ఈ విషయమై కలెక్టర్‌కు తీర్మానం చేసి తీర్మానం ప్రతి పంపించాలని ఎంపీపీ మెరుగు రాజేశ్వరి ఎంపీడీవోను ఆదేశించారు. బోరుభద్రలో రహదారి వెడల్పులో భాగంగా, సంబంధిత అధికారులు కొన్ని షాపులు, కొంతమంది ఇళ్లు కూలగొట్టారని, నెలలు గడుస్తున్నా పూర్తి కాకపోవడంతో డ్రైనేజీల్లో చెత్త పేరుకుపోయి, ఈగలు విపరీతంగా పెరిగాయని సభ్యులు చింతాడ చిన్నారావు అధికారులకు తెలియజేశారు. విద్యుత్ స్తంభాలు ఉన్నందున సకాలంలో పూర్తవడం లేదని జేఈ అంజిత్‌కుమార్ సమాధానం చెప్పారు. విద్యుత్ స్తంభాలు తొలగించేందుకు తగిన డీడీలు చెల్లిస్తేనే తొలగించడం అవుతుందని విద్యుత్ శాఖ ఏఈ సమాధానం ఇచ్చారు. పాలతలగాం, శ్రీకృష్ణాపురం గ్రామాల్లో లోవోల్టేజీ ఉందని, ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయాలని సర్పంచ్ ప్రతినిధి నక్కిట్ల నరేష్ అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. వైద్యాధికారులు గైర్హాజర్‌పై సభ్యులు మండిపడ్డారు. డీఎంహెచ్‌వో వస్తున్నందున రాలేదని నౌపడ పీహెచ్‌సీ ఫార్మసిస్ట్ సమాధానం చెప్పడంతో, భావనపాడు సర్పంచ్, ఎంపీటీసీ బుడ్డా మోహన్ రెడ్డి, బుడ్డా రాజేశ్వరి మీరు కోర్టు గుమస్తాలా, ఆసుపత్రి గుమస్తాగా వచ్చి సమాధానం చెప్తే రోగులు ఇబ్బంది పడతారని మండిపడ్డారు. సమావేశంలో ఎంపీడీవో విజయంతి ప్రసాద్, వైస్ ఎంపీపీలు నక్క చింతామణి, పొందల తులసమ్మ పాల్గొన్నారు.



## నిస్సహాయులకు అన్న వితరణ

**శ్రీకాకుళం, సెప్టెంబరు 3(వార్త):** అన్నప్రసాద వితరనలో అందరూ భాగం కావాలని, బాడీ బిల్డర్స్ అసోసియేషన్ కార్యదర్శి వి.విజయ్‌కుమార్ అన్నారు. స్థానిక నైట్ షెల్టర్ ఆవరణలో నిస్సహాయులకు బుధవారం ఆయన అన్నవితరణ చేపట్టి మాట్లాడారు. ఆకలితో అలమటించే నిరుపేదలకు, ఏదో ఒక రూపంలో ఆదుకోవాలని కోరారు. బుధవారం తన పెళ్లి రోజు, జన్మదినం సందర్భంగా అన్నప్రసాదాన్ని అందించామన్నారు. వీలైనంత వరకు, మనకు ఉన్నదానితో పరులకు సహాయపడాలన్నారు. ఈ సందర్భంగా ఆయనకు సామాజిక సేవకుడు ఉర్లం శివతేజ పట్నాయక్ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో దాత విజయ్‌కుమార్ కుటుంబసభ్యులు, నైట్ షెల్టర్ నిస్సహాయులు పాల్గొన్నారు.

## పలు కుటుంబాల్ని పరామర్శించిన వైసీపీ నాయకులు



**పలాస, సెప్టెంబరు 3(వార్త):** ఇటీవల మృతి చెందిన వారి కుటుంబాలను వైసీపీ నాయకులు బుధవారం పరామర్శించారు. వజ్రపు కొత్తూరు మండలంలో రాజాం గ్రామ సీనియర్ నాయకులు, మాజీ సర్పంచ్ పిట్ట రామారావు కిడ్నీ వ్యాధితో మృతి చెందారు. బొడ్డపాడులో మాకనపల్లి మాజీ సర్పంచ్ నీలకంఠం సీతమ్మ నాన్న తామాడ మృతి చెందారు. మాజీ జడ్పీటీసీ హరిప్రసాద్ బావ మందస మండలం డిమిరియా గ్రామస్తుడు సీర చినబాబు హఠాత్తుగా మృతి చెందారు. వీరి కుటుంబాలను వారు పరామర్శించి, తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు. పరామర్శించిన వారిలో పలాస మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు, మాజీ అగ్నికుల క్షత్రియ డైరెక్టర్ జుత్తు నీలకంఠం, గొర్ల వేణుగోపాల్, మాజీ సర్పంచ్ మారడ భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

## రేపు విద్యుత్ అంతరాయం

**నరసన్నపేట, సెప్టెంబరు 3(వార్త):** ఉర్లాం విద్యుత్తు ఉపకేంద్రం, దేవాది విద్యుత్తు ఉప కేంద్రంపరిధిలో శుక్రవారం మరమ్మతులు, చెట్లు కొమ్మలు తొలగించుట చేపట్టనున్నామని ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఇ.నరసింహ కుమార్ తెలిపారు. దీంతో ఆయా ఉప కేంద్రాల పరిధిలోని గ్రామాలకు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామన్నారు. ఆయా గ్రామాల విద్యుత్ వినియోగదారులు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని ఆయన కోరారు.

## ఉపాధ్యాయుడిని సన్మానించిన ఎస్ఆర్ షాపింగ్ మాల్ యాజమాన్యం


**నరసన్నపేట, సెప్టెంబరు 3(వార్త):** సత్యవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సీనియర్ ఉపాధ్యాయుడు కింజరాపు లక్ష్మణరావును ఎస్ఆర్ షాపింగ్ మాల్ యాజమాన్యం బుధవారం పాఠశాల ప్రధానోపాధ్యాయిని రత్నమాల, ఉపాధ్యాయులు, విద్యార్థుల సమక్షంలో ఘనంగా సన్మానించింది. ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపిక చేసింది. కార్యక్రమంలో ఎస్ఆర్ షాపింగ్‌మాల్ యాజమాన్యం, పాఠశాల ప్రధానోపాధ్యాయిని, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.




# గణపతి మండపాల ఏర్పాటు శుభదాయకం

**- ప్రత్యేక పూజలు చేసిన ఎమ్మెల్యే గౌతు శిరీష**

**పలాస, సెప్టెంబరు 3(వార్త):** గణపతి మండపాలు ఏర్పాటు చేసి పూజలు నిర్వహించటం శుభ సూచకమని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. బుధవారం ఎంపీడీవో కార్యాలయం వద్ద ఉన్న గణేష్ ఉత్సవ కమిటీ వాళ్లు ఏర్పాటు చేసిన గణేష్ మండపాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ విధంగా అందరూ కలిసికట్టుగా ఏకమై గణేష్ మండపాలు ఏర్పాటు చేసి పూజలు చేయడం శుభసూచికమని, ఈ రోజుల్లో యువత అనేక చెడు వ్యసనాలకు బానిసలై జీవితాల్ని నాశనం చేసుకుంటున్నారని, అలా కాకుండా ఈ విధంగా భక్తి మార్గంలో నడుస్తూ కలిసికట్టుగా సమాజంలో దైవభక్తిని పెంపొందిస్తూ, దైవ మార్గంలో నడవాలని కోరారు. ఈమెతో పాటు స్థానిక వార్డ్ కౌన్సిలర్ దువ్వాడ శ్రీకాంత్, ఏపీ ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ వజ్జ బాబూరావు, బద్ద నాగరాజు, లోడగల కామేష్, ఉత్సవ కమిటీ సభ్యులు జయంత్ మాస్టర్, నరసింహ మూర్తి, బాబురావు, శంకర్ తదితరులు పాల్గొన్నారు.



జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## ఈదుపురం సైనికోద్యోగుల వితరణ

**ఇచ్ఛాపురం, సెప్టెంబరు 3(వార్త):** గత కొద్దిరోజుల క్రితం ఈదుపురం నకు చెందిన రౌలో సంతోష్ బ్రైన్ ట్యూమర్ తొ మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న ఈదుపురం డిఫెన్స్ సర్వీస్ అసోసియేషన్ గమనించిన సభ్యులు తమ వంతు సాయంగా 10 వేల రూపాయలు మృతుడి భార్య రౌలో సుమిత్రాకి అందజేశారు. కార్యక్రమంలో అంబటి ఈశ్వరరావు, కేశవరావు, బొర బాలకృష్ణ, దువ్వ నారాయణ తదితరులు పాల్గొన్నారు.





## కన్నబాబు కుటుంబానికి పరామర్శ

**ఇచ్ఛాపురం, సెప్టెంబరు 3(వార్త):** కాకినాడ రూరల్ మాజీ ఎమ్మెల్యే మాజీ మంత్రి వై ఎస్ ఆర్ సీపీ ఉత్తరాంధ్ర కోఆర్డినేటర్ కురసాల కన్నబాబు తండ్రి మృతికి రాష్ట్ర వైస్సార్సీపీ బి సి విభాగం కార్యదర్శి నర్తు నరేంద్ర యాదవ్ సంతాపం వ్యక్తం చేశారు కాకినాడ లో స్వగృహం లో కన్నా బాబు ని కలిసి తన ప్రగాఢ సంతాపం తెలియజేసి కురసాల సత్యనారాయణ చిత్రపటానికి శ్రద్ధాంజలి ఘటించారు కార్యక్రమంలో కంచిలి ఎంపీపీ పైల దేవదాస్ రెడ్డి, కంచిలి మండల పార్టీ అధ్యక్షులు వజ్జ మృత్యు%శీ%జయ, సోంపేట జడ్పీటీసీ ప్రతినిధి తడక జోగారావు, ఇచ్చాపురం నియోజకవర్గం యువజన అధ్యక్షులు నర్తు ప్రేమ్ కుమార్ యాదవ్ సర్పంచ్ కొనపల సురేష్ కేశవ్ పాత్రో శ్రీను సాయి భాస్కర్ తదితరులు ఉన్నారు.

## ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన కళాసీ



**పలాస, సెప్టెంబరు 3(వార్త):** పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీలోని 23 వ వార్డు కాపు వీధికి చెందిన కోరాడ గవరయ్య (35) మంగళవారం ఉదయం పదునైన ఆయుధంతో గొంతు కోసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. రక్తపు మడుగులో పడి ఉన్న గవరయ్యను గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం హుటాహుటిన పలాస ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం నిమిత్తం శ్రీకాకుళం జిల్లా కేంద్రంలో ఉన్న రిమ్స్ ఆసుపత్రికి తరలించి ఘటనపై కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. కుటుంబ కలహాలే కారణమని పోలీసులు భావిస్తున్నారు. కళాసి పనిచేస్తున్న గవరయ్య గత కొద్ది రోజులుగా మద్యం సేవిస్తు పనికి వెళ్లకుండా భార్య ధనలక్ష్మితో గొడవ పడేవాడని తెలుస్తోంది. జీడి కార్మికురాలైన భార్య ధనలక్ష్మి దినచర్యలో భాగంగా జీడి పరిశ్రమకు వెళ్లిన మరుక్షణం ఈ అఘాయిత్యానికి ఒడిగట్టాడని , పోలీసులు ,కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ ఘటన పై కాశీబుగ్గ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## నేత్రదానంపై
## మందస కేజీబీవీలో వక్తృత్వ పోటీలు




**మందస, సెప్టెంబరు 3(వార్త):** జాతీయ నేత్ర దాన పక్షోత్సవాలు సందర్భంగా మందస మండలంలోని వీరగున్నమ్మపురం సమీపంలో గల కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో వక్తృత్వ పోటీలు నిర్వహించారు. పోటీల్లో 9వ తరగతి విద్యార్థిని ఎన్.మానస ప్రథమ బహుమతి, 10వ తరగతి విద్యార్థిని బి.షాలిని ద్వితీయ బహుమతి పొందారు. ప్రిన్సిపాల్ రఘుపాత్రుని వాసంతి మాట్లాడుతూ నేత్రదానంపై విద్యార్థులు విస్తృత ప్రచారం చెయ్యాలని కోరారు. అవయవదానం ఆవశ్యకత, ప్రాధాన్యతను వివరించారు. ఆప్తాల్మిక్ ఆఫీసర్ రోణంకి వెంకటరమణ నేత్రదానంపై అవగాహన కల్పించారు. నేత్రదానం చేసి, చిరంజీవులు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయురాలు జి.సంతోషి, ఉపాధ్యాయులు బి.భాగ్యలక్ష్మి, ఎల్.లలితకుమారి, ఉపాధ్యాయలు, విద్యార్థులు పాల్గొన్నారు.




# శభాష్..పోలీస్!

**-పరిమళించిన మానవత్వం**

**-అనాథ మృతదేహాలకు అంతిమసంస్కారాల నిర్వహణ**

**-ఆదర్శప్రాయంగా నిలుస్తున్న రామారావు,సురేష్**




**ఇచ్ఛాపురం/ శ్రీకాకుళం క్రైమ్, సెప్టెంబరు 3(వార్త):** ఖాకీ అంటేనే కర్కశత్వం, ఖాకీ అంటేనే క్రూరత్వం అనే నానుడి ఎప్పటి నుంచో నాటుకు పోయింది. బహుశా సినిమాల ప్రభావమో లేక ఆది నుంచి ఉన్న భావనో ఏమో తెలియదు గానీ.. అందరినీ అదే దృష్టి కోణంలో చూస్తుంటారు. కానీ వారిలో కూడా మానవత్వం పరిమళించే దయార్ద్ర హృదయులు ఉన్నారు. వారి కాఠిన్యం వెనుక కరుణ రసం కూడా ఉంటుంది. ఇదే విషయాన్ని కొంత మంది పోలీసులు నిరూపిస్తున్నారు. వారిలో ఉన్నది కూడా మనుషులేనని ఫ్రెండ్లీ పోలీసింగ్ విధానానికి కొత్త భాష్యం చెపుతున్నారు. నిన్నటివరకు ఇచ్ఛాపురం టౌన్ పోలీస్ స్టేషన్లో హెడ్ కానిస్టేబుల్గా పనిచేసిన తెలుకల రామారావు సుమారు 10కి పైగా అనాథ మృతదేహాలకు అంతిమ సంస్కారాలు నిర్వహించారు. స్వయంగా పాడే మోసి దగ్గర ఉండి దహన సంస్కారాలు జరిపించారు. అంతే కాదు దశ దిన ఖర్మలు కూడా నిర్వహించారు. అక్కడితో ఆగకుండా వీరి మృతితో అనాథలైన చిన్నారులను దత్తత కూడా తీసుకునే వారు. ఇదే కోవలో టౌన్ పోలీస్ స్టేషన్లో కానిస్టేబుల్గా పనిచేస్తున్న టి.అశోక్ కూడా నిలుస్తున్నారు. బాహుదా నదిలో అనాథ మృతదేహానికి అంతిమ సంస్కారాలు నిర్వహించారు. గత నెల 29న పాత టోల్ గేటు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక గుర్తు తెలియని యాచకుడు మృతి చెందాడు. మృతదేహంపై వాహనాలు వెళ్లడంతో శరీరం నుజ్జునుజ్జు అయ్యింది. ఏ మాత్రం గుర్తు పట్టలేని విధంగా మారింది. ప్రభుత్వ ఆసుపత్రిలో శవ పంచనామా నిర్వహించి పోస్ట్ మార్టం నిర్వహించారు. సీఐ ఎం.చిన్నంనాయుడు, టౌన్ ఎస్ఐ ఎం.ముకుందరావు సూచనలతో అంతిమ సంస్కారాలు నిర్వహించారు. 2018 బ్యాచ్కి చెందిన సురేష్ 2022లో శ్రీకాకుళంలో పనిచేశారు. అనంతరం స్పెషల్ టాస్క్ ఫోర్స్కి బదిలీ అయ్యారు. అనంతరం శ్రీకాకుళం టౌన్లో ట్రాఫిక్ విధులు నిర్వహించారు. ప్రస్తుతం ఇచ్ఛాపురం టౌన్లో పనిచేస్తున్నారు. సురేష్ చేసిన పనికి అందరూ అభినందిస్తున్నారు.

## ఘనంగా పవన్కల్యాణ్ జన్మదిన వేడుకలు








**హిరమండలం/ఎల్ఎన్ పేట, సెప్టెంబరు 3(వార్త):** హైదరాబాదులో నివసిస్తున్న శ్రీకాకుళం జిల్లా వాసులందరూ సుడా చైర్మన్ కొరికానా రవికుమార్, పాతపట్నం జనసేన నాయకురాలు కొరికాన భవాని స్ఫూర్తితో ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి కొల్ల జయరామ్ అధ్యక్షతన, ఎల్ఎన్ పేట మండల అధ్యక్షుడు, ఏఎంసీ డైరెక్టర్ కొల్ల రవీంద్ర ఆధ్వర్యంలో డిప్యూటీ సీఎం పవన్కళ్యాణ్ జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. శ్రీ మల్లన్న దేవాలయంలో ప్రత్యేక రుద్రాభిషేకం, సాయంత్రం కళ్యాణ్ మండపంలో కేక్ కటింగ్ నిర్వహించారు.

కార్యక్రమంలో చంపాపేట్ డివిజన్ అధ్యక్షుడు, భామిని మండల నాయకులు శ్రీనివాస్, ఎల్ఎన్ పేట మండల ప్రధాన కార్యదర్శి శివ్వాల శ్రీని వాస్, భామిని మండల నాయకులు కొనపాల గిరి, ప్రవీణ్, శరత్, పలాస నాయకులు లావేటి సురేష్, ఎల్ఎన్ పేట మండల నాయకులు ఈశ్వర్, రామ కోటి, భామిని నాయకులు ప్రమోద్, పోలినాయుడు, పాతపట్నం నాయకులు మురళి, సోషల్ మీడియా కోఆర్డినేటర్ దీపక్ కల్యాణ్, జనసైనికులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## మూలిపాడు అంగన్వాడీ కేంద్రంపై దర్యాప్తు

**మందస, సెప్టెంబరు 3(వార్త):** మూలిపాడు అంగన్ వాడీ కేంద్రం పై జిల్లా అధికారులు తనిఖీ చేశారు. ఈ అంగన్ వాడీ కేంద్రంపై ఇటీవల పలు అవినీతి ఆరోపణలు వచ్చాయి. బాధితుల ఫిర్యాదు మేరకు స్త్రీ, శిశు సంక్షేమ శాఖ జిల్లా సాధికారత అధికారిణి విమల మూలిపాడు అంగన్ వాడీ కేంద్రం తనిఖీ, దర్యాప్తు నిర్వహించారు. రికార్డులను పరిశీలించి, ఫిర్యాదుదారుల ఇంటికి వెళ్లి విచారించారు. లబ్ధిదారులతో అంగన్వాడీ కేంద్రం నుంచి పంపిణీ చేస్తున్న పౌష్టికాహారంపై ఆరా తీశారు. ఫిర్యాదుదారులు, గ్రామస్తుల నుంచి వివరాలు సేకరించారు. అనంతరం మందసలోని 5, 7 అంగన్ వాడీ కేంద్రాలను వారు పరిశీలించారు. నోడల్ అధికారిణి మణి, మందస సీడీపీఓ పెద్దింటి అరుణ, సురేష్, సూపరువైజర్ సీహెచ్ వీ రామలక్ష్మి పాల్గొన్నారు.



జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం



## సజ్జలతో అన్వేష్ భేటీ



**ఇచ్ఛాపురం, సెప్టెంబరు 3(వార్త):** వైఎస్ఆర్ సి పి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సజ్జాల. రామకృష్ణ రెడ్డి ని తాడేపల్లి ప్రధాన కార్యాలయం లో వైఎస్ఆర్ సీపీ రాష్ట్ర క్రిష్టియన్ మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి డా. ప్రత్తి. అన్వేష్ భేటీ అయ్యారు. ఈ భేటీ లో ముఖ్యం గా క్రైస్తవ్యం లో జరుగుతున్న సమస్యలు తెలియజేసి క్రైస్తవానికి వ్యతిరేకముగా దాడులు జరుగుతున్న విధానము వివరించినట్లు చెప్పారు., ప్రతి సమస్య వినీ సానుకూలంగా స్పందించినట్లు చెప్పారు.

# మహిళా సంఘాల ప్రగతికి పది సూత్రాలు





**మందస, సెప్టెంబరు 3(వార్త):** స్వయంశక్తి మహిళా సంఘాల ప్రగతికి పది రాజీలేని సూత్రాలు తప్పనిసరిగా అందరూ పాటించాలని వెలుగు ఐ.టీ. డీ.ఏ. అసిస్టెంట్ ప్రాజెక్ట్ మేనేజర్ పైడి కూర్మారావు వివరించారు. మందసలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతి సంఘం క్రమము తప్ప కుండా షెడ్యూల్ ప్రకారమే మీటింగులు నిర్వహించాలని, సమావేశానికి ప్రతి సభ్యురాలు విధిగా హాజరు కావాలని, ఉద్దేశపూర్వకంగానే హాజరుకాని సభ్యురాలిని సంఘంలో కొనసాగ నివ్వరాదని, సమావేశం లోనే అందరి సమక్షంలో పొదుపులు, అప్పులకు సంబంధించి డబ్బులు వసూలు పారదర్శకంగా జరగాలని, సంఘం నిధి నుంచి అవసరం మేరకు సభ్యులకు తక్కువ వడ్డీకి మీటింగు లోనే అప్పులిచ్చి, తిరిగి వాయిదాల ప్రకారం వసూలు జరపాలన్నారు. సభ్యురాలు వారీ సంఘం వారీ లెక్కలు వివరంగా అందరికీ అర్థం అయినట్లు సంగ్రహ పట్టికలో పారదర్శకంగా నమోదు చేసుకోవాలని, సమావేశం జరిగినప్పుడే మినిట్స్ తీర్మానం పుస్తకంలో రాసుకొని సంతకాలు చేయాలని, మైక్రో క్రెడిట్ ప్లాన్ ప్రకారం మాత్రమే సభ్యురాలు ఆదాయాభివృద్ధి కార్యక్రమాలకు అప్పులు ఇచ్చుకోవాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ అప్పులను సమానంగా పంచుకోరాదని, మీటింగు దగ్గరకి వచ్చి వాయిదాల ప్రకారం అప్పు కట్టని ఏ సభ్యురాలకి కూడా సంఘం ఆమోదం లేకుండా మళ్ళీ కొత్త లోన్ మంజూరు చేయకూడదని, ఏ బ్యాంకుగాని, గ్రామ సంఘం కానీ, శ్రీనిధి మహిళా బ్యాంకు గాని నేరుగా ఏ సభ్యురాలుకి అప్పు మంజూరు చేయరని, కేవలం సంఘానికి మాత్రమే డైరెక్టుగా ఇస్తారని, పూర్తిగా అప్పుతీర్చవలసిన బాధ్యత సంఘం మొత్తానికి ఉంటుందన్నారు. కేవలం సభ్యురాలుది మాత్రమే కాదని, ప్రతి సంఘం షెడ్యూల్ ప్రకారం జరిగే నెలవారీ గ్రామ సంఘం మీటింగులుకు హాజరై, మన డబ్బులు మన లెక్కలు యాప్ ద్వారా ఆర్థిక అంశాలు క్షుణ్ణంగా తెలుసుకోవడంతో పాటు, సామాజిక బాధ్యతలు పాటిస్తూ, అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు వర్తించేలా గ్రామ సంఘం సేవలను వినియోగించుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

# తిప్పనపుట్టుగలో అలరించిన సోలో కచేరీ



**ఇచ్ఛాపురం, సెప్టెంబరు 3(వార్త):** తిప్పనపుట్టుగ లొ వరసిద్ధి వినాయక చవితి నవరాత్రి ఉత్సవాలు భాగంగా ఏడువ రోజు కళాకారులు కళా పోషకుడు బోర రామారావు ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన అర్థ ఏకాహం సంగీతభజనలో ఉదయం నుంచి మధ్యాహ్నం మూడు గంటల వరకు స్థానిక ఉద్యానవ పరిసర ప్రాంతాల కళాకారులతో భజన ఏర్పాటు చేశారు. అనంతరం మూడు గంటల నుంచి ఆరు గంటల వరకు ఆముదాలవలస వాస్తవ్యులు ప్రముఖ వయొలిన్ విద్వాంసులు దుంపల ఈశ్వరరావు, వయోలిన్ ప్రముఖ అంతర్జాతీయ కళాకారులు మావుడూరు సత్యనారాయణ శర్మ కుమారుడు మావుడూరు వాయునందన శర్మ, ప్రముఖ ఉద్యానవన మృదంగం విద్వాంసులు చలపరాయి వినోద్ కుమార్, నరసన్నపేట వాస్తవ్యులు బ్రహ్మం ఆచారి మోర్సింగ్ పై, మాస్టర్ చలపరాయి సాయి చరణ్ ఘటంపై సహకరించారు. కచేరి శ్రోతలను ఎంతో ఆకట్టుకుంది. అనంతరం గ్రామ పెద్దలు కమిటీ సభ్యులు, సంగీత కళాకారులను ప్రత్యేకంగా సన్మానం చేశారు. కచేరి భజన ఏర్పాటుచేసిన కళాకారులు, కళాపోషకులు బోర రామారావుకి ప్రత్యేకంగా అభినందించారు.

# అఖిల భారతీయ యాదవ మహాసభ నూతన కార్యవర్గం

**ఇచ్ఛాపురం, సెప్టెంబరు 3(వార్త):** అఖిల భారతీయ యాదవ మహాసభ నూతన కార్యవర్గం నియామకం జరిగింది. శ్రీకాకుళం యాదవ భవనంలో, రాష్ట్ర అధ్యక్షులు గద్దెబోయిన గురునాథ్ యాదవ్, జిల్లా అధ్యక్షులు గద్దెబోయిన కృష్ణా యాదవ్ ఆధ్వర్యంలో జరిగిన యాదవ సభలో కార్యవర్గ నియామకం జరిగింది. ఇచ్ఛాపురం నుండి రాష్ట్ర యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ దాసరి రాజును జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ గా ఇచ్ఛాపురం నియోజకవర్గం అధ్యక్షులుగా జన్నెలా సంతోష్ కుమార్ ను, ఇచ్ఛాపురం మున్సిపాలిటీ అధ్యక్షులుగా సాలిన జగదీష్ యాదవ్ ను, ఇచ్ఛాపురం మండల అధ్యక్షులుగా కాళ్ళ సంతోష్ కుమార్ ను, కంచిలి మండలం అధ్యక్షులుగా తలగాన వాసు దేవ్ ను కవిటి మండల అధ్యక్షులుగా నర్తు జోగారావును, సోంపేట మండల అధ్యక్షులుగా కొల్లి దివాకర్ ను నియమిస్తూ అఖిల భారతీయ యాదవ మహాసభ రాష్ట్ర అధ్యక్షులు గద్దెబోయిన గుర్నాథ్ యాదవ్, జిల్లా అధ్యక్షులు జారీ చేశారు.





## మహిళలకు సన్మానం

**ఇచ్ఛాపురం, సెప్టెంబరు 3(వార్త):** గురు మహోత్సవ సందర్భంగా 23 వార్డు బెల్లుపడ కాలనీ ప్రాథమిక పాఠశాలలో గతంలో పనిచేసిన ఉపాధ్యాయులు అమ్మానమ్మ, సాయి లకు మరియు గతంలో వార్డులో పని చేసిన పూర్వ అంగన్వాడి కార్యకర్త నాగరత్నం పూర్వ ఆశ వర్కర్ శోభారాణి, లను ఘనంగా సన్మానించారు. అలాగే తైక్వాన్డో క్రీడాకారులుపాలెపు సాయి జగదీష్ ను కూడా అభినందించారు, అంగన్వాడి కార్యకర్తలుకి పాఠశాల ఉపాధ్యాయులందరికీ 23 వార్డు కౌన్సిలర్ గువ్వాడ ప్రదీప్ కుమార్ సాలువతో ఘనంగా సన్మానం చేసి మెమెంటో అందజేశారు, ఈ కార్యక్రమంలో ఎంఈఓ అప్పారావు , వార్డు ఇంచార్జ్ సంతోష్ రథో వార్డు పెద్దలు గువ్వాడ దిలీప్ కుమార్, గవరయ్య, మల్ల వైకుంఠ రావు, శాసన శేఖర్ ,పాలెప్ దివాకర్ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## 100 రోజుల టైలరింగ్ శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలు




**పలాస, సెప్టెంబరు 3(వార్త):** కాశీబుగ్గ శ్రీనివాస నగర్ లో పలాస మండల పరిధిలో గల మహిళలకు 100 రోజుల శిక్షణ కార్యక్రమం బుధవారం తో పూర్తి అయినది. ప్రభుత్వం సమాజంలో మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెంది స్వశక్తి తో జీవించాలని ఉచితంగా కుట్టు శిక్షణ కార్యక్రమం కల్పించింది. ఈ శిక్షణ ఏప్రిల్ 28 నుంచి సెప్టెంబర్ 3 వ తేదీవరకు 100 రోజులు దిగ్విజయంగా పూర్తి అయినది. మహిళలకు ప్రభుత్వం ఉచితంగా కుట్టు మిషన్లు ఏర్పాటు చేయడం తో శిక్షణ పూర్తి చేసుకున్నారు. ఈ శిక్షణకు ఆపరేటర్ గా ఎం కుమారి, ట్రైనర్ గా బి శిరీష లు వ్యవహారించారు.

## గొడియాల బందచెరువుకు గండి

**మెళియాపుట్టి, సెప్టెంబరు 3(వార్త):** గడిచిన రెండురోజులగా కురుస్తున్న వర్షాలకు మండలంలోని పాత్రలోవ గ్రామంలో గల గొడియాల బందచెరువుకు గండిపడింది. దీంతో చెరువు కిందనున్న పంటపొలాలల్లోకి నీరు ప్రవహించడంతో నీటితో పాటు కొంతమేర వరిపొలాల్లో మట్టి కూడ చేరడంతో స్థానికులు, రైతులు చూసి అధికారులకు సమాచారం ఇచ్చారు. గండికొట్టిన ప్రదేశాన్ని విఆర్వో దేవేంద్ర పరిశీలించారు. సుమారు చెరువుకు 40 ఎకరాలపైనే ఆయకట్టు ఉందని రైతులు చెబుతున్నారు. వెంటనే గండి ని పూడ్చే చర్యలు చేపట్టాలని అలా చేయకుంటే పంట నష్టపోయే పరిస్థితి ఏర్పడుతుందని దీన్ని నివారణ చర్యల్లో భాగంగా ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో వ్యవహరించి చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.



Printed and published and Owner by Chowdari Pramod Kumar , printed at Chowdari Printers, Near RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546